సాక్షి వరంగల్
గురువారం | 19 | జనవరి | 2023



ఆర్జేడీ కార్యాలయం రాజధానికి!
హనుమకొండలోని ఇంటర్‌విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) కార్యాలయాన్ని రాజధానికి తరలించే కుట్రలు కొంత కాలంగా జరుగుతున్నాయి. - 8లో▸



దేశ సంస్కృతి గొప్పది
దేశ సంస్కృతీ సంప్రదాయాలు ఎంతో ఉన్నతంగా ఉన్నాయని, జీవన విధానం చాలా బాగుందని విదేశీయుల బృందం అభిప్రాయపడింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0°/18.0°

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కంటి పరీక్షలు చేయించుకోవాలి



సంగెం: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని డీపీఓ కల్పన అన్నారు. బుధవారం గవిచర్లలోని కంటి వెలుగు శిబిరాన్ని ఆమె సందర్శించారు. అనంతరం గవిచర్ల గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. రామచంద్రాపురంలోని పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటికలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొమురయ్య, సర్పంచ్‌లు దొనికెల రమాశ్రీనివాస్, బొంపల్లి జయశ్రీ దిలీప్‌రావు, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, వంశీ, ఏఈఓ సాగర్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' కేంద్రం పరిశీలన



రాయపర్తి: మండల కేంద్రంలోని కొండూరు రోడ్డులో గల బాలికల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారులు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో కీటక జనిత వ్యాధుల నియంత్రణ జిల్లా ప్రోగ్రాం అధికారి చల్లా మధుసూదన్, వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ రూరల్: గ్రూప్–2, 3, 4 ఉద్యోగాలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతీ యువకులకు మూడు నెలలపాటు ఉచిత ప్రత్యేక ఫౌండేషన్ కోర్సు శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ డాక్టర్ బి.గోపి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా www.tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వంద సీట్లలో 33 శాతం మహిళలకు, 5 శాతం దివ్యాంగులకు కేటాయించారని, ఇతర వివరాలకు 86397 16717, 97047 35235 నంబర్లలో కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని తెలిపారు.

వరంగల్ మార్కెట్‌లో మిర్చి ధరలు



వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వండర్ హాట్ మిర్చి క్వింటా ధర రూ.35వేలు పలికిందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి.రాహుల్ తెలిపారు. యూఎస్–341 రకం రూ.22వేలు, తేజ రూ.20వేలు, తాలు మిర్చి క్వింటా ధర రూ.8వేలు పలికిందని, 5,927 బస్తాల మిర్చి విక్రయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే పత్తి క్వింటా ధర రూ.7,860 పలికిందని, 1,718 బస్తాలు అమ్మకానికి వచ్చినట్లు తెలిపారు.

'కాళోజీ' రిజిస్ట్రార్‌గా సంధ్య బాధ్యతల స్వీకరణ



ఎంజీఎం: కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా బుధవారం డాక్టర్ సుంకరనేని సంధ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆమె యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ బి.కరుణాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా సీఓఈ డాక్టర్ మల్లేశ్వర్, జాయింట్ రిజిస్ట్రార్లు దొడ్డ రమేష్‌కుమార్, అనిత గ్రేస్, ఎస్‌ఓ సురేఖ, డీఆర్ సుధాకర్‌రావు, రామానుజరావు, సీఐఓ వెంకటయ్య, పీఆర్‌ఓ కిరణ్మయి తదితరులు అభినందనలు తెలిపారు.

యాడున్నా ఓటు పక్కా..

నూతన విధానానికి కేంద్ర ఎన్నికల సంఘం శ్రీకారం

- వలసదారులు, కూలీలకు ఓటుపై ఆసక్తి పెంచేందుకు కృషి
- ముందస్తు దరఖాస్తు చేసుకుంటేనే అవకాశం



నర్సంపేట: వలసదారుల ఓటు హక్కు విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. స్వగ్రామంలో ఓటు హక్కు ఉన్నా.. బతుకు దెరువు కోసం సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారు.. ఎన్నికల సమయంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల రాలేకపోవడం.. ఓటు హక్కు వినియోగించుకోలేకపోవడం.. ఇత్యాది కారణాలను గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం.. ఎక్కడ ఉన్నప్పటికీ అక్కడి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించనుంది. దీంతో జిల్లా నుంచి వలస వెళ్లిన వ్యక్తులకు ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు అవకాశం లభించినట్లయింది. వ్యవసాయాధారిత జిల్లా కావడం.. పల్లెలు ఎక్కువగా ఉండడం.. వ్యవసాయ పనులు లేని సమయంలో బతుకు దెరువు కోసం హైదరాబాద్, సూరత్ తదితర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి స్వగ్రామానికి వచ్చేందుకు ఆర్థిక భారం పడటం.. సుదూర ప్రాంతాల నుంచి రాలేక ఓటు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఓటింగ్ శాతం పడిపోయిన సందర్భాలున్నాయి. అయితే కేంద్ర ఎన్నికల సంఘం తీసుకురానున్న నూతన విధానం వల్ల ఉన్న చోటు నుంచే ఓటు వేసే రిమోట్ ఓటింగ్ సిస్టం ద్వారా అధిక శాతం నమోదుకు ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోంది. అయితే ఓటర్లు తాము ఉంటున్న ప్రాంతాల నుంచే ముందస్తుగా ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు.

పెరగనున్న ఓటింగ్ శాతం

కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొస్తున్న నూతన విధానం వల్ల జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. నర్సంపేట నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లు 283 ఉండగా.. వర్ధన్నపేట నియోజకవర్గంలో 268, తూర్పు నియోజకవర్గంలో 215 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. నర్సంపేట నియోజకవర్గంలో 2,18,293 మంది ఓటర్లు, వర్ధన్నపేటలో 2,49,545 మంది, తూర్పు నియోజకవర్గంలో 2,66,825 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతీ ఎన్నికల సమయంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన ఓటర్లు ఇతర ప్రాంతాల్లో నివసిస్తుండటం వల్ల ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారు. కేంద్రం తీసుకొచ్చే నూతన విధానం ఓటర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఓటింగ్ ఎక్కువగా ఉంటుంది..



రిమోట్ ఓటింగ్ విధానం అమలులోకి వస్తే ఓటింగ్ శాతం పెరగడంతోపాటు ఎన్నికల ఫలితాల్లో కూడా స్పష్టమైన తీర్పు ఉంటుంది. వీరిని ఎన్నికల సమయంలో స్వగ్రామాలకు రప్పించడం సాధ్యం కావడం లేదు. ఒకవేళ రప్పించినా అభ్యర్థులపై భారం పడుతుంది.

– జాటోతు సంతోష్‌నాయక్, మహబూబాబాద్ బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు

వలస కూలీలకు ఉపయోగం..



జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారు. ఎన్నికల సమయంలో ఓటు హక్కు ఉన్న చోటకు వచ్చి ఓటు వేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంటాయి. నూతన విధానంతో వలస కూలీలకు ఇబ్బందులు తొలగుతాయి.

– ఓర్సు తిరుపతి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు

ఈ విధానం బాగుంటుంది..



దూర ప్రాంతాల్లో విద్యనభ్యసించే యువత ఎన్నికల సమయంలో వచ్చేందుకు ఇబ్బంది పడుతుంటారు. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం నూతనంగా తెచ్చిన విధానంతో ఉన్న చోట నుంచే ఓటు హక్కు వినియోగించుకుంటారు. పోలింగ్ శాతం పెరుగుతుంది.

– తడిగొప్పుల మల్లేశ్, బీఆర్‌ఎస్ యూత్ నాయకుడు

సభ బస్సులను ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి: ఖమ్మం బీఆర్‌ఎస్ బహిరంగ సభకు తరలివెళ్లే బస్సులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. మండలంలోని 39 గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో ఖమ్మం బహిరంగ సభకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సభకు జాగ్రత్తగా తరలి వెళ్లాలని సూచించడంతోపాటు కార్యకర్తలకు నూతనోత్తేజం కల్పించారు. పెర్కవేడులో మంత్రి సతీమణి ఎర్రబెల్లి ఉషాదయాకర్‌రావు పార్టీ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నర్సయ్య, ఐత రాంచందర్, సుదర్శన్‌రెడ్డి, చిన్నాల రాజబాబు, బండి రాజబాబు, బొమ్మెర వీరస్వామి, కుల్ల వెంకన్న, వెంకటాచారి, బండి కుమార్, బొమ్మెర వీరన్న తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.



రాయపర్తిలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి దయాకర్‌రావు

సమన్వయంతో సక్సెస్ చేయాలి

- గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: కంటి వెలుగు శిబిరాలను వైద్యారోగ్య, బల్దియా సిబ్బంది సమన్వయంతో విజయవంతం చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య.. అధికారులను ఆదేశించారు. నగరంలో గురువారం నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో హనుమకొండ బాలసముద్రం, న్యూ శాయంపేట, వరంగల్‌లోని ఉర్సు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను బుధవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గురువారం నుంచి జూన్ 30 వరకు 100 రోజులపాటు జరిగే ఈ శిబిరాల్లో వైద్య ఆరోగ్య, మున్సిపల్ నోడల్ అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయంలో నోడల్ అధికారులు, ఉద్యోగులతో సమావేశమై పలు సూచనలు చేశారు. 66వ డివిజన్‌లలో 37 మెడికల్ టీమ్‌ల ద్వారా శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, సీఎంహెచ్‌ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్, డిప్యూటీ కమిషనర్ అనిసుర్ రషీద్, శ్రీనివాస్‌రెడ్డి, జోనా, ఎంహెచ్‌ఓ రాజేష్, డీఈ రవికుమార్ పాల్గొన్నారు.



న్యూశాయంపేటలో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ప్రావీణ్య

చిరుధాన్యాలు పండించాలి

- జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్



వర్ధన్నపేట: ఇల్లందలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

వర్ధన్నపేట: చిరుధాన్యాల సాగుపై అవగాహన కలిగి ఉండటంతోపాటు పండించేందుకు రైతులు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ అన్నారు. 2023ను అంతర్జాతీయ మిల్లెట్ దినోత్సవంగా ప్రపంచ దేశాలు గుర్తించిన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఇల్లంద గ్రామంలోని రైతు వేదికలో చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉషాదయాళ్ మాట్లాడుతూ చిరుధాన్యాలు అయిన జొన్నలు, కొర్రలు, సామలు, రాగులు, అరికెలు, అండు కొర్రలు, ఊదలు, వరిగెల వంటి పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. 70 నుంచి 110 రోజుల్లో పంట కాలం పూర్తవుతుందని, త్వరగా రైతుల చేతికి ఆదాయం వస్తుందన్నారు. వీటిని బీడు, సాగుకు పనికిరాని ఖాళీగా ఉన్న నేలల్లో తేలికగా సాగు చేసుకోవచ్చన్నారు. చిరుధాన్యాల్లో 12 నుంచి 14 రకాల ప్రొటీన్స్ ఉంటాయని వివరించారు. అనంతరం రైతుల అవగాహన కోసం చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడంతోపాటు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ సురేశ్‌కుమార్, ఏఓ రాంనర్సయ్య, డాట్ సెంటర్ కో ఆర్డినేటర్ నర్సయ్య, ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం కన్సల్టెంట్ పి.సారంగం, మామునూరు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య, సర్పంచ్ సుంకరి సాంబయ్య, ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్, రైతు కన్వీనర్ నాంపెల్లి వెంకన్న, ఉప సర్పంచ్ మడ్డి రాజ్‌కుమార్, బాషా, సీసీ గోలి కొమురయ్య, రైతులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ప్రయోజనం

పర్వతగిరి: చిరు ధాన్యాలు పండించడం వల్ల అధిక ప్రయోజనాలతోపాటు ఖర్చు కూడా తక్కువగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి డి.ఉషాదయాళ్ అన్నారు. అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరాన్ని పురస్కరించుకొని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కొంకపాక గ్రామంలోని రైతు వేదికలో బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఫుడ్ ఫెస్టివల్ రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషాదయాళ్ మాట్లాడుతూ చిరు ధాన్యాలు ఆరోగ్యానికి చాలా మంచివన్నారు. కేవీకే మామునూరు శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్.సౌమ్య మాట్లాడుతూ చిరు ధాన్యాల యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. జనవరి, ఫిబ్రవరిలో జొన్న, సజ్జ, రాగి, కొర్రలు విత్తుకోవడానికి అనుకూలమని అన్నారు. ఈ పంటల వల్ల ఆరోగ్యం పాడవకుండా.. పర్యావరణ కాలుష్యం కాకుండా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో మిల్లెట్ మాన్యజీ తెలంగాణ వీరశెట్టి, ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం కన్సల్టెంట్ పి.సారంగం, ఏఓ ప్రశాంత్, ఏడీఏ సురేశ్‌కుమార్, ఏఈఓలు రవి, రాజేశ్, రాకేశ్, చందులాల్, స్రవంతి, సర్పంచ్‌లు సుబ్బారావు, వర్కాల రమేశ్, పంజా మహేశ్, ఎంపీటీసీ మోహన్‌రావు, కో ఆర్డినేటర్ అశోక్, రైతులు పాల్గొన్నారు.

పరీక్షలు.. అద్దాలే..!

ఆపరేషన్లు లేకుండా నేటినుంచి 'కంటి వెలుగు'

- జిల్లాలో 44 బృందాలు.. 440 మంది సిబ్బంది
- ప్రతీ మండలానికి ఓ స్పెషల్ ఆఫీసర్ నియామకం

గీసుకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సర్వం సిద్ధం చేసింది. తొలుత మాక్‌డ్రిల్ చేపట్టిన అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రెడీగా ఉన్నారు. అయితే ఆపరేషన్లు లేకుండానే కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం కంటి పరీక్షలు నిర్వహించి.. అవసరం ఉన్న వారికి రీడింగ్ గ్లాసులు, మందులు ఇవ్వనున్నారు. పరీక్షల సందర్భంగా కంటి ఆపరేషన్లు అవసరం ఉందని గుర్తించిన వారిని ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేయవద్దని ప్రభుత్వం వైద్యాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. బుధవారం సీఎం కేసీఆర్ కంటి వెలుగును ఖమ్మంలో లాంఛనంగా ప్రారంభించగా.. జిల్లాలో గురువారం నుంచి షురూ చేయనున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా కంటి పరీక్షలు నిర్వహించడానికి 44 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీ బృందంలో 10 మంది ఉండగా.. మొత్తం 440 మంది కంటి పరీక్ష శిబిరాల వద్ద విధులు నిర్వహించనున్నారు. రోజూ గ్రామీణ ప్రాంతంలో 300, పట్టణ ప్రాంతంలో 400 మందికి పరీక్షలు చేసేలా ప్రణాళిక రూపొందించారు. కలెక్టర్ గోపి ఇప్పటికే జిల్లాస్థాయి అధికారులను ప్రతీ మండలానికి ఓ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తగిన చర్యలు చేపట్టారు.

జిల్లాలో కంటి వెలుగు ఇలా..

జిల్లా జనాభా	9.97 లక్షలు
18 ఏళ్ల పైబడిన వారు సుమారు	5 లక్షలు
వచ్చిన రీడింగ్ గ్లాసులు	75 వేలు
ఏర్పాటు చేసిన మొత్తం బృందాలు	44
అర్బన్‌లో 19, రూరల్‌లో 25 బృందాలు	
సేవలు అందించే వైద్యులు, సిబ్బంది	440

శిబిరంలో పరీక్షలు ఇలా..

కంటి పరీక్షల శిబిరంలో మొత్తం ఐదు టేబుళ్లు ఉంటాయి. మొదటి టేబుల్ వద్ద కూర్చున్న ఇద్దరు ఆశాలు పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన వారి పేర్లను నమోదు(రిజిస్ట్రేషన్) చేస్తారు. వారికి ఆధార్ లేదా రేషన్ లేదా ఆరోగ్యశ్రీ కార్డు, ఫోన్ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. అలా రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత రెండో టేబుల్ వద్ద మూడు మీటర్ల దూరం నుంచి గుర్తుల ఆధారంగా చూపును పరీక్షిస్తారు. మూడో టేబుల్ వద్ద డాక్టర్ కంట్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని పరిశీలిస్తారు. నాల్గవ టేబుల్ వద్ద ప్రత్యేక యంత్రం ఆటోమెటిక్ ఆబ్జెక్టివ్ రిఫ్రాక్టర్ ద్వారా దృష్టిని పరిశీలిస్తారు.అలాగే కటకాల ద్వారా(సబ్జెక్టివ్ రిఫ్రాక్షన్) పరీక్షిస్తారు. ఐదో టేబుల్ వద్ద వారి కంటి సమస్య, సామర్థ్యాన్ని ఆధారంగా దగ్గర చూపు లోపం ఉంటే వెంటనే రీడింగ్ గ్లాసులు వారికి పంపిణీ చేస్తారు. దూరపు చూపు, ఇతర కంటి సమస్యలు ఉంటే వారి వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్ ద్వారా ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో ఆన్‌లైన్ చేసి హైదరాబాద్‌కు పంపిస్తారు. వారిలో అర్హులైన వారికి 15 రోజుల్లో ప్రిస్క్రిప్షనల్ అద్దాలు సంబంధిత పీహెచ్‌సీకి పంపిస్తే వాటిని లబ్ధిదారులకు అందిస్తారు. కంటికి సంబంధించిన ఇతర వ్యాధులు, సమస్యలను గుర్తించి సమాచారాన్ని క్రోడీకరించి పదిలపరుస్తారు.



గీసుకొండలో ఏర్పాటు చేసిన కంటి పరీక్షల కేంద్రం

కంటి వెలుగును ప్రారంభించనున్న మంత్రి ఎర్రబెల్లి

కాగా..రాయపర్తి ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో కంటివెలుగు కార్యక్రమాన్ని గురువారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రారంభించనున్నారు. అలాగే పరకాల,నర్సంపేట,వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేలువారి పరిధిలోని ప్రాంతాల్లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.

అందరి సహకారం అవసరం..



కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వైద్య, ఆరోగ్య శాఖతోపాటు పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం. ఇప్పటికే 44 కంటి పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశాం. శిబిరంలోనే వెంటనే రీడింగ్ గ్లాసులు అందిస్తాం. ప్రిస్క్రిప్షన్ గ్లాసులను 15 రోజుల్లో కంపెనీ నుంచి ఆర్డర్‌పై తెప్పించి పీహెచ్‌సీల ద్వారా లబ్ధిదారులకు అందిస్తాం.

– డాక్టర్ కె.వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ

రూ.10.45కోట్లు

ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం

- ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్‌సర్వీసులు
- అధికారులు బస్‌స్టేషన్‌లో ఉండి పర్యవేక్షణ

హన్మకొండ: వరంగల్ రీజియన్‌లో సంక్రాంతి పండుగకు టీఎస్ ఆర్టీసీ రెగ్యులర్ సర్వీస్‌లతోపాటు డిమాండ్ ఉన్న రూట్‌లలో ప్రత్యేక బస్సులు నడిపింది. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేయడంతోపాటు ఆదాయాన్ని సమకూర్చుకుంది. సంక్రాంతి పండుగకు విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో ఈ నెల 11 నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. 17వ తేదీ వరకు మొత్తంగా రూ.10.45 కోట్ల ఆదాయాన్ని రాబట్టుకుంది. బుధవారం కూడా ప్రయాణికుల రద్దీ కొనసాగింది. వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత, డిప్యూటీ ఆర్‌ఎంలు కృపాకర్‌రెడ్డి, మాధవరావు, డిపో మేనేజర్లు బస్‌స్టేషన్‌లో మకాం వేసి డిమాండ్ ఉన్న రూట్‌లలో అప్పటికప్పుడు బస్సులు సమకూర్చారు. ప్రధానంగా హైదరాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారం–మంగపేట, కరీంనగర్–నిజామాబాద్‌తోపాటు పలు రూట్లలో రోజూ నడిచే బస్‌సర్వీస్‌లకు అదనంగా నడిపారు.



హనుమకొండ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

పండుగ రోజుల్లో ఆర్టీసీ ఆదాయం (రూ.కోట్లలో)

తేదీ	ఆదాయం
11	1.52
12	1.93
13	1.09
14	1.56
15	0.86
16	1.55
17	1.94

- వరంగల్ రీజియన్ సగటు ఆదాయం రోజుకు రూ.1.05కోట్లు

భద్రకాళి బండ్ సాగదీత ఎన్నాళ్లు?

వరంగల్ అర్బన్: భద్రకాళి బండ్ ఫేస్–2 అభివృద్ధి పనులను ఎన్నాళ్లు సాగదీస్తారని కమిషనర్ ప్రావీణ్య.. ఇంజనీర్లను ప్రశ్నించారు. భద్రకాళి బండ్ ఫేస్–2లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. స్మార్ట్ సిటీ, సీఎం ప్రత్యేక నిధులతో చేపడుతున్న పనుల టెండర్లు, ఒప్పందాలు, నిర్దేశిత గడువు తదితర వివరాలను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఒప్పందాల మేరకు అభివృద్ధి పనులను ఇప్పటికే పూర్తి చేయాల్సి ఉందని, ఇకనైనా కాంట్రాక్టు సంస్థలపై ఒత్తిడి తెచ్చి త్వరగా పూర్తి చేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. బండ్‌పై జోన్ సీ వద్ద ఏర్పాటు చేస్తున్న జాతీయ జెండా పనులను వేగవంతం చేయాలన్నారు.

ఎదురుపిల్ల పండుగకు ఏర్పాట్లు

ములుగు రూరల్: మాఘశుద్ధ పౌర్ణమి రోజున నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా ఆదిదేవత గట్టమ్మ తల్లికి ఎదురుపిల్ల పండుగ ఏర్పాట్లను ఆలయ పూజారులు చేపట్టారు. ఈ మేరకు బుధవారం ఆదివాసీ నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలో ఆలయాన్ని శుద్ధి చేశారు. ఈనెల 25న ఎదురుపిల్ల పండుగ నిర్వహిస్తామని తెలిపారు.

సీఎం సభకు ఆర్టీసీ బస్సులు

- ప్రయాణికుల ఇబ్బందులు

హన్మకొండ: ఖమ్మం సీఎం బహిరంగ సభకు టీఎస్ ఆర్టీసీ బస్సులు సమకూర్చడంతో పలు రూట్లలో సర్వీసులు రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు తిరుగు ప్రయాణం పట్టారు. ఈ క్రమంలో బుధవారం నెలకొన్న బస్సుల కొరత ప్రయాణికులను ఇక్కట్ల పాలుజేసింది. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో 930 బస్సులుండగా.. ఇందులో 300 బస్సులు సీఎం కేసీఆర్ బహిరంగ సభకు వెళ్లడంతో పలు రూట్లలో సర్వీసులను రద్దు చేశారు. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్‌లో పల్లె వెలుగు రూట్ల బస్ పాయింట్లు బస్సులు లేక ప్లాట్‌ఫామ్‌లు ఖాళీగా కనిపించగా.. ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షిస్తూ పడిగాపులు కాశారు. హైదరాబాద్ వంటి ప్రధాన రూట్లలో బస్సుల కొరత లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు.



హనుమకొండ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ కోర్సుల(నాన్ ప్రొఫెషనల్) కోర్సుల మూడో సెమిస్టర్(రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్ష ఫీజు చెల్లింపు గడువును అపరాధ రుసుము లేకుండా ఈనెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి తెలిపారు.

రూ.250 అపరాధ రుసుముతో ఈనెల 27వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తకొండకెళ్లొస్తూ.. పరలోకాలకు!


శ్రీకాంత్(ఫైల్)

భీమదేవరపల్లి: కోరిన కోర్కెలు తీర్చమని కొత్తకొండకెళ్లాడు. వీరభద్రుడిని దర్శించుకొని వస్తుండగా.. రోడ్డు ప్రమాదం ఆ యువకుడిని కబళించింది. ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్‌కు చెందిన అంబాల శ్రీకాంత్(26) మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శ్రీకాంత్ తన స్నేహితులైన శ్రీధర్, రాహుల్‌తో కలిసి మంగళవారం బైక్‌పై కొత్తకొండ జాతరకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో ముత్తారం శివారు హనుమాన్ టెంపుల్ వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా.. రాహుల్, శ్రీధర్‌కు గాయాలయ్యాయి. హెల్మెట్ పెట్టుకుంటే శ్రీధర్ బతికేవాడేమో అని స్థానికులు చర్చించుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..


విష్ణువర్ధన్(ఫైల్)

మంగపేట: మండలంలోని చుంచుపల్లి–పాలాయిగూడెం గ్రామాల మధ్య ఈనెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న చుంచుపల్లి గ్రామానికి చెందిన పూసం విష్ణువర్ధన్ (34) మంగళవారం రాత్రి మృతి చెందాడు. చుంచుపల్లి నుంచి మిర్చి బస్తాల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ రోడ్డు పక్కన ఉన్న కల్లంలోకి వెళ్లేందుకు ఏటూరునాగారం–బ్రాహ్మణపల్లి ప్రధాన రోడ్డును దాటుతోంది. రాజుపేట నుంచి బైక్‌పై వస్తున్న విష్ణువర్ధన్ ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అతడిని స్థానికులు ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మంగళవారం రాత్రి విష్ణు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

చెన్నారావుపేట: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కందిగడ్డ తండా గ్రామ శివారు బోసుల్ తండాకు చెందిన మూడు మోహన్ (40) అప్పుల బాధతో బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మోహన్ కూలీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అప్పు తెచ్చి కూతురు వివాహం జరిపించాడు. పనులు దొరక్క అప్పులు చెల్లించలేక మనోవేదనకు గురయ్యాడు. దీంతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎల్లయ్య తెలిపారు.

కుటుంబ కలహాలతో మరొకరు..

మహాముత్తారం: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన కొర్లకుంట జీపీ లంబాడిపల్లికి చెందిన బోద ధర్మయ్య(35) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మయ్య కొన్నేళ్లుగా కుటుంబ కలహాలతో భార్యకు దూరంగా ఉంటున్నాడు. మానసికంగా బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో బుధవారం ఉరేసుకున్నాడు. అతడి తల్లి జగ్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

రాజధానికి ఆర్జేడీ కార్యాలయం!

- మల్టీజోన్–1 ఫైళ్లు తరలించేందుకు యత్నం!
- ఇప్పటికే మల్టీజోన్–2 ఫైళ్లు హైదరాబాద్‌కు..
- ఆర్జేడీ ఓడీపై భాగ్యనగరం నుంచే విధులు
- పెండింగ్‌లో అనేక ఫైళ్లు

విద్యారణ్యపురి: దశాబ్దాలుగా హనుమకొండలో ఉన్న ఇంటర్‌విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) కార్యాలయాన్ని రాష్ట్ర రాజధానికి తరలించే కుట్రలు కొంత కాలంగా జరుగుతున్నాయి. అప్పట్లోనే తరలించేందుకు యత్నించగా.. పలువురు ప్రజాప్రతినిధుల చొరవతో తాత్కాలికంగా నిలిపేశారు. ఇంటర్‌విద్యకు రెగ్యులర్ ఆర్జేడీగా జయప్రద బాయి ఉన్నప్పటికీ ఆన్‌డ్యూటీ (ఓడీ) పేరు మీద హైదరాబాద్ ఇంటర్ విద్య కమిషనరేట్‌లోనే విధులు నిర్వర్తిస్తూ అక్కడి నుంచి పాలన కొనసాగిస్తూ వస్తున్నారు. దీంతో ఫైళ్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. తాజాగా.. మల్టీ జోన్–1కు సంబంధించిన ఫైళ్లను కూడా హైదరాబాద్‌కు తరలించేందుకు యత్నిస్తున్నారు. ఈమేరకు సంబంధిత ఉద్యోగులకు కూడా ఫైళ్లు పంపాలనే సమాచారం ఈనెల 17న అందించినట్లు చర్చ జరుగుతోంది. ఇంటర్‌విద్య ఆర్జేడీ కార్యాలయాన్ని హైదరాబాద్‌కు తరలించాలనే యత్నాలు సరికావనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యానికి కొత్త జిల్లాలు ఏర్పాటు చేస్తే.. ఇక్కడున్న ఆర్జేడీ కార్యాలయాన్ని అక్కడికి తరలించడం ఎంత వరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు.


అద్దె భవనంలో ఉన్న ఇంటర్‌విద్య ఆర్జేడీ కార్యాలయం

మల్టీ జోన్1, మల్టీ జోన్ 2

ఇంటర్ విద్యలో గతంలో ఐదో జోన్, ఆరో జోన్‌లుగా ఉండి ఆయా అన్ని జిల్లాల పరిధిలో 407 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. నాన్ టీచింగ్ ఉద్యోగులు, అధ్యాపకులకు సంబంధించి సర్వీస్ మ్యాటర్లతో పాటు పలు అంశాలు కార్యాకలాపాలు ఇక్కడే కొనసాగుతూ వస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం 5వ జోన్‌ను కొద్ది మార్పులతో మల్టీ జోన్–1గాను, 6వ జోన్, హైదరాబాద్ సిటీ జోన్ కలిపి, మల్టీజోన్–2లుగా మార్చిన విషయం తెలిసిందే. మల్టీజోన్1 పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. మల్టీ జోన్–2లో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి నల్గొండ, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. హనుమకొండలోని ఆరెండు జోన్లకు సంబంధించి కూడా హనుమకొండలోనే ఆర్జేడీ కార్యాలయంలోనే కొంత కాలం క్రితం వరకు కార్యకలాపాలు కొనసాగేవి. గత కొన్ని నెలల క్రితమే ఇక్కడి ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయంలోని మల్టీజోన్–2 కు సంబంధించిన జిల్లాలకు ఫైళ్లన్నీ హైదరాబాద్‌లోని ఇంటర్ విద్య కమిషనరేట్‌కు తరలించారని సమాచారం.

ఫైళ్లు పంపాలని సమాచారం

ఆర్జేడీ మల్టీ జోన్–1కు సంబంధించి ఫైళ్లను హైదరాబాద్ కమిషనరేట్‌కు పంపాలని ఈనెల 17న ఓ మెయిల్ ఇక్కడ ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయానికి వచ్చినట్లు సమాచారం. ఆలేఖపై సంబంధిత అధికారుల సంతకం లేదని తెలుస్తోంది. ఫైళ్లన్నీ అక్కడికి పంపితే తమకు ఎక్కడ విధులు కేటాయిస్తారో అని హనుమకొండలోని ఇంటర్ విద్య ఆర్జేడీ కార్యాలయ ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. కార్యాలయంలో సుమారు 14 మంది ఉద్యోగులు ఏఓ, సూపరింటెండెంట్లు, సీనియర్ అసిసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. ఆర్జేడీ కార్యాలయాన్ని తరలిస్తే మల్టీజోన్‌లో ఉన్న ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లా జూనియర్ కళాశాలల అధ్యాపకులకు, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఇబ్బందులు తప్పవని భావిస్తున్నారు. సర్వీస్ మ్యాటర్లు, ఆటో అడ్వాన్స్‌మెంట్ ఇంక్రిమెంట్లు, టీచింగ్, నాన్ టీచింగ్ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ, కళాశాలల పర్యవేక్షణ వంటి బాధ్యతలు ఉంటాయి. కార్యాలయ తరలింపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకపోయినప్పటికీ కుట్రలు జరుగుతున్నట్లు చర్చ జరుగుతోంది.

ఇప్పటికే..

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంబంధించిన (కళాశాల విద్య) ఉన్నత విద్య 5వ జోన్, 6వ జోన్‌లకు సంబంధించిన ఆర్జేడీ కార్యాలయాన్ని కొన్నేళ్ల క్రితమే రాజధానికి తరలించారు. క్రమంగా ఇంటర్‌విద్య ఆర్జేడీ కార్యాలయాన్ని కూడా తరలించేందుకు కుట్ర జరుగుతోంది. అందుకు నిదర్శనంగా రెగ్యులర్ ఆర్జేడీని ఆన్‌డ్యూటీ(ఓడీ)పై హైదరాబాద్‌లోనే కొనసాగించటం, ఆర్జేడీ కూడా ఇక్కడికి వచ్చి విధులు నిర్వర్తించేందుకు సుముఖంగా లేకపోవడం బట్టి స్పష్టమవుతుంది. ఫైళ్లు కూడా అక్కడికే తరించడం అంటే క్రమంగా ఆయా ఉద్యోగులను కూడా ఇతర కళాశాలలకు పంపుతారా? అనే చర్చ సాగుతోంది. ఆర్జేడీ తనకు అనుకూలం కోసం ఏకంగా కార్యాలయాన్నే తరలించే యత్నాలు చేస్తుండడంపై పలువురు ప్రజాప్రతినిధుల దృష్టికి కూడా తీసుకెళ్లాలని యోచిస్తున్నట్లు సమాచారం.

జారిన మాట.. పోయిన ప్రాణం

- మద్యం మత్తులో దూషణ
- క్షణికావేశంలో అన్నను చంపిన తమ్ముడు


ఘటనాస్థలిలో చందర్ రావు మృతదేహం

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం కొప్పుసూరు గ్రామానికి చెందిన రొడ్డ చందర్‌రావు (50)ను తమ్ముడు నర్సింహారావు కర్రతో తలపై కొట్టి చంపాడు. అతిగా మద్యం సేవించిన చందర్‌రావు తమ్ముడిని దూషించాడు. తట్టుకోలేక పోయిన నర్సింహారావు క్షణికావేశంతో అన్న తలపై బలంగా మోదాడు. దీంతో చందర్‌రావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై కొప్పుల తిరుపతిరావు, వెంకటాపురం(కె) సీఐ కాగితోజు శివప్రసాద్ ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని ఏటూరు నాగారం సివిల్ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏదైనా దొరక్కపోతుందా?



ఊరుకాని ఊరొచ్చాయి. ఆహారం సంపాదించాలంటే కాసింత ఓర్పు అవసరమే కదా.. ఈ వలస పక్షులు పిల్లలతోపాటు అవి తినేందుకు ఏదైనా దొరక్కపోతుందా అని ఓపికగా నీటివైపు చూస్తున్నాయి. ఐనవోలు మండలం ముల్కలగూడెం చెరువులో వలసపక్షుల సందడి నెలకొంది.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, హనుమకొండ

యూనియన్‌ను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్

- బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్‌ను సంస్థాగతంగా బలోపేతం చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. బుధవారం హనుమకొండ బాల సముద్రంలోని సామా జగన్‌మోహన్‌రెడ్డి భవన్‌లో బీఎంఎస్ అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ టీఎస్ ఎన్పీడీసీఎల్ కంపెనీ శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈసమావేశానికి ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 జిల్లాల నుంచి యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులు యూనియన్‌కు అండగా నిలవాలన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధి అన్ని జిల్లాల్లో యూనియన్‌ను మరింత పటిష్టం చేయాలని సూచించారు. టీఆర్‌వీకేఎస్ నుంచి ఉత్తం రాజేశ్, గాజుల సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో 50 మంది ఉద్యోగులు టీఆర్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరగా.. వారికి బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీఆర్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు రావు రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూనియన్ డిస్కం ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు జి.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి జి.రవీందర్, నాయకులు కడెం మహేశ్, గోలి అనిల్‌రెడ్డి, డి.లక్ష్మణ్ నాయక్, పి.వేమన్‌రెడ్డి, డి.వేణుమాధవ్, సంగీత్‌కుమార్, పుల్లాజీ, వెంకటేశ్వర్లు, మదన్‌మోహన్, యుగేందర్, వేణు, సాయి కృష్ణ, శ్రీకాంత్, వరజ, ధనలక్ష్మి, సరోజన, కృష్ణవేణి, వనిత, నర్సమ్మ, వీఎంరెడ్డి, నవీన్, రంగారెడ్డి పాల్గొన్నారు.

చోరీకి విఫలయత్నం

- చితకబాదిన గ్రామస్తులు


గ్రామస్తుల చేతిలో దెబ్బలు తింటున్న యువకుడు

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటలో మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు దొంగలు తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చొరబడి చోరీకి యత్నించారు. గ్రామస్తులు వెంబడించి ఓ దొంగను పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఎల్లంపేట గ్రామానికి చెందిన తాళ్లపల్లి రమేశ్, కొండ రుద్ర సంక్రాంతి పండుగకు బంధువుల ఇంటికి వెళ్లారు. ఈక్రమంలో ఇద్దరు దొంగలు మంగళవారం అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై ఊళ్లోకి వచ్చారు. గ్రామ శివారులో తాళం వేసి ఉన్న రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఆయా గృహాల్లోని విలువైన సామగ్రిని దొంగిలించి బైక్‌పై ఉడాయించేందుకు యత్నించగా.. బుధవారం తెల్లవారు జామున వాకింగ్‌కు వెళ్తున్న ఓ వ్యక్తి చూసి గ్రామస్తులను అప్రమత్తం చేశాడు. వెంబడించి ఒక దొంగను గ్రామస్తులు పట్టుకోగా మరో దొంగ పరారయ్యాడు. పట్టుబడిన వ్యక్తిని గ్రామస్తులు చెట్టుకు కట్టేసి చితకబాదారు. అనంతరం మరిపెడ పోలీసులకు అతడిని అప్పగించారు. కాగా.. దొంగతనాలకు యత్నించిన వ్యక్తులది ఉమ్మడి నల్గొండ జిల్లా అని గ్రామస్తులు తెలిపారు.

దేశ సంస్కృతి గొప్పది

- విదేశీయుల బృందం
- వర్ధన్నపేటలో స్టడీ టూర్


బాలవికాస ప్రతినిధులతో విదేశీయుల బృందం

వర్ధన్నపేట: దేశ సంస్కృతీ, సంప్రదాయాలు బాగున్నాయని విదేశీయుల బృందం అభిప్రాయపడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో స్టడీ టూర్‌లో భాగంగా విదేశీయులు బుధవారం బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొదుపు సంఘాల పని తీరు, వారు చేస్తున్న చేతి వృత్తులను, మహిళల పురోగతిని పరిశీలించడానికి వచ్చినట్లు ఎన్ఐఆర్‌డీ కో–ఆర్డినేటర్ ప్రదీప్‌గౌడ్ తెలిపారు. ఆసియా, ఆఫ్రికా ఖండాల నుంచి స్టడీ టూర్‌కు వచ్చిన విదేశీయుల బృందం బుధవారం వర్ధన్నపేటలోని బాల వికాస కార్యాలయానికి వచ్చి ప్రతినిధులతో మాట్లాడి పలు అంశాలు తెలుసుకున్నారు. బాలవికాస ఆధ్వర్యంలో పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉండి రుణాలు తీసుకుని చిరు వ్యాపారం చేస్తున్న వారితో ఫొటోలు దిగారు. వారి వద్ద నుంచి పండ్లు కొన్నారు. ఇల్లందను సందర్శించి చేతి వృత్తుల వారి వద్దకు వెళ్లి వారి పని తీరును పరిశీలించారు.

రెచ్చిపోతున్న నకిలీ చేనేత మాఫియా

- బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ దాసు సురేశ్


నకిలీ పోచంపల్లి ఇక్కత్ చీరను చూపిస్తున్న దాసు సురేశ్

నయీంనగర్: తెలంగాణలో రూ.50 వేల కోట్ల నకిలీ చేనేత వస్త్రాల మాఫియా కొనసాగుతోందని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ దాసు సురేశ్ ఆరోపించారు. బుధవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరంగల్‌లో ప్రఖ్యాత వెడ్డింగ్ మాల్‌లో అడ్డంగా పట్టుబడిన నకిలీ పోచంపల్లి ఇక్కత్ చీరను ప్రదర్శిస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పండుగల వేళ ప్రభుత్వ అండదండలతో ఒకే వ్యక్తి 25 బినామీ సంస్థలు నడుపుతూ, నకిలీ చేనేత వస్త్రాలు తయారు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నట్లు ఆరోపించారు. దీంతో చేనేత కార్మికులు నష్టపోతున్నారన్నారు. ఈవిషయంపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చాపర్తి కుమార్ గాడ్గె,మాదాసు సురేష్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టివేత

- బొలేరో, బైక్ సీజ్


పట్టుబడిన నల్లబెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కేసముద్రం: చిత్తూరు జిల్లా నుంచి బొలేరో, బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల నల్లబెల్లం, రెండు బస్తాల పటిక, సారాయిని ఎక్సైజ్‌శాఖ అధికారులు మండలంలోని అమీనాపురం గ్రామ సమీపంలో బుధవారం పట్టుకున్నారు. చిత్తూరుకు చెందిన నాగరాజునాయుడు నుంచి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలోని శివారు గిర్నితండాకు చెందిన బానోతు కృష్ణ బొలేరోలో, టీవీఎస్ స్కూటీపై అక్రమంగా 60 బస్తాల్లో 30 క్వింటాళ్ల నల్లబెల్లం, రెండు బస్తాల్లో పటిక, 30 లీటర్ల నాటుసారాను, కేసముద్రం మండలం అమీనాపురం గ్రామ సమీపానికి తరలించారు. తమకు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్‌శాఖ అధికారులు ఆ రెండు వాహనాలను పట్టుకున్నారు. బెల్లం దిగుమతి చేసే స్థలంలో ఉన్న 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. బెల్లాన్ని ఇక్కడికి సప్‌లై చేయిస్తున్న బానోతు కృష్ణను, చిత్తూరుకు చెందిన బొలేరో డ్రైవర్ చొడప్పను అరెస్టు చేసి, పరారీలో ఉన్న నాగరాజునాయుడుపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపారు. బొలేరో వాహనం, టీవీఎస్ స్కూటీని సీజ్ చేసి, పట్టుకున్న బెల్లం, పట్టిక, సారాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై జయశ్రీ, హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య, కానిస్టేబుళ్లు సుధాకర్, నరేశ్, వెంకన్న, యుగేందర్, దేవేందర్ పాల్గొన్నారు.

భవనాల కూల్చివేత


భవనాన్ని కూల్చివేస్తున్న జేసీబీలు

హసన్‌పర్తి: పార్కింగ్ స్థలాల్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై అధికారులు కొరడా ఝళిపించారు. బుధవారం భవనాలను జేసీబీతో కూల్చేశారు. భీమారం శివారులో ముప్పై ఏళ్ల క్రితం 52 ఎకరాల్లో బస్వారెడ్డి టౌన్‌షిప్ ఏర్పాటు చేశారు. ఇందులో ప్రజల సౌకర్యార్థం నాలుగు పార్కింగ్ స్థలాలు కేటాయించారు. ఒక్కో పార్కింగ్ కోసం 0.20 ఎకరాల స్థలాన్ని వదిలిపెట్టారు. ఈటౌన్‌షిప్‌కు అనుమతి కూడా ఉంది. ఇందుకు సంబంధించి పార్కింగ్ స్థలంలో నలుగురు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారు. ఇక్కడ పార్కింగ్ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారని కొంతమంది విజిలెన్స్, సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టి నోటీసులిచ్చారు.

నిర్మాణాల కూల్చివేత..

నోటీసు గడువు ముగియడంతో సంబంధిత అధికారులు నిర్మాణాలను కూల్చేశారు. ఓవైపు కూల్చివేతలు చేపడుతుండగా.. బాధితులు కూల్చివేతను అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో అధికారుల, బాధితుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు పరిస్థితిని సమీక్షించారు.

ఉపాధి.. ఉత్పాదకత.. అభివృద్ధి

- జీవాలను ఉత్పత్తి చేయడమే ప్రభుత్వాల లక్ష్యం
- గొర్రెల పెంపకానికి ప్రోత్సాహం
- 50 శాతం రాయితీ
- యూనిట్ విలువ రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు



గొర్రెల యూనిట్ ప్రాజెక్టు వివరాలు

యూనిట్	రాయితీ
100 ఆడ, 5 మగ	రూ.10 లక్షలు
200 ఆడ, 10 మగ	రూ.20 లక్షలు
300 ఆడ, 15 మగ	రూ.30 లక్షలు
400 ఆడ, 20 మగ	రూ.40 లక్షలు
500 ఆడ, 25 మగ	రూ.50 లక్షలు

హన్మకొండ: పశు వైద్య, పశు సంవర్ధక శాఖలో భారీ రాయితీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందక దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది. ఈపరిస్థితిని చక్కదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా వ్యవస్థాపక అభివృద్ధి, జంతు ఉత్పాదకత, ఉపాధి కల్పన లక్ష్యంగా పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా గొర్రెల పెంపకాన్ని కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు యూనిట్‌ను ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. యూనిట్‌కు రూ.50 శాతం రాయితీని అందిస్తోంది. మిగతా సొమ్ము బ్యాంకు రుణం లేదా లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. కనిష్ట రాయితీ రూ.10 లక్షలు, గరిష్ఠ రాయితీ రూ.50 లక్షలు లభిస్తుంది. యూనిట్‌ను బట్టి రాయితీ లభిస్తుంది. మేకలు, గొర్రెల జాతి సంపదను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. బ్రీడ్ (జాతి) అభివృద్ధి ద్వారా ఆయా జంతువుల ఉత్పాదకత పెంచడమే లక్ష్యం

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ద్వారా ఏర్పాటైన సంస్థ ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలో పశు వైద్య, పశు సంవర్ధకశాఖ ద్వారా ఈ పథకం అమలవుతోంది. ఇందులో భాగంగా ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులను కమిటీ పరిశీలించి సంతృప్తి చెందాక మంజూరు చేస్తుంది. దరఖాస్తులు పరిశీలించి షెడ్యూల్డ్ బ్యాంకులు, లేదా నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌సీడీసీ) వంటి ఆర్థిక సంస్థల ద్వారా ఆర్థిక, రుణ సాయం పొందేందుకు స్టేట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ సిఫారసు చేస్తుంది. రుణ సంస్థలు ప్రాజెక్టు అమలుకు రుణ సహాయం చేసేందుకు ముందుకు రాగానే.. రాష్ట్ర స్థాయి కమిటీ, రాష్ట్ర ప్రభుత్వం యూనిట్‌ను మంజూరు చేస్తుంది.

ఎవరెవరు అర్హులంటే..

వ్యక్తులు, రైతు సంఘాలు, స్వయం సహాయ సంఘాలు, సెక్షన్ 8 కంపెనీలు ఈ పథకానికి అర్హులు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రం రాయితీ అందిస్తుంది. సదరు వ్యక్తులు లేదా సంస్థలకు సొంత స్థలమైనా లేదా లీజు ప్రాతిపదికనైనా స్థలం తీసుకుని ఉండాలి. స్థలం 5 ఎకరాలుండాలి. కేవైసీ సంబంధిత డాక్యుమెంట్లు ఉండాలి. మేకలు, గొర్రెలు బ్రీడింగ్ యూనిట్‌లో మార్గదర్శకాలకు లోబడి హైజెనెటిక్ రకాలను ఎంచుకోవాలి. అధిక మేక పాలను ఉత్పత్తి చేసేవి, నాణ్యమైన మాంసం, ఉన్ని అందించే రకాలను ఎంచుకోవాల్సి ఉంటుంది. రూ. 50 లక్షల సబ్సిడీని రెండు విడుతలుగా బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంది. మిగిలిన 50 శాతం మొత్తాన్ని రుణంగా తీసుకోవాలి.. లేదా సొంతంగా పెట్టుబడి పెట్టాలి. అయిదు రకాల యూనిట్ (ప్రాజెక్టు)ను ఔత్సాహికుల ముందు ప్రభుత్వం ఉంచింది. వారి స్థోమత, సమర్థత, అనుకూలత, పరిస్థితులను బట్టి ఎంచుకునేలా యూనిట్ల రూపకల్పన చేసింది. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు..



నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో భాగంగా అమలు చేస్తున్న గొర్రెల జాతి అభివృద్ధి పథకానికి ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. యూనిట్‌ను రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందులో 50 శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. ఆసక్తి ఉన్నవాళ్లు సమీపంలోని పశు వైద్య, పశు సంవర్ధక అధికారుల్ని సంప్రదించాలి.

– డాక్టర్ వెంకటరమణ, పశు వైద్యాధికారి, హనుమకొండ జిల్లా